చెక్కుల పంపిణీ



తొర్రూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో అబ్దుల్లాపూర్‌మెట్, తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట్ ప్రాంతాలకు చెందిన 72 మంది లబ్ధిదారులకు రూ. 32,16,500 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదివారం అందజేశారు.
- హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి

జీవో 118ను అడ్డుకున్న దుర్మార్గుడు మధుయాష్కీగౌడ్

● ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వనస్థలిపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జీవో 118ను అడ్డుకున్న దుర్మార్గుడు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆరోపించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారుల తప్పిదం మూలంగా బీఎన్‌రెడ్డినగర్, నాగోల్ డివిజన్‌లోని సుమారు 32 కాలనీల్లో పెండింగ్ రిజిస్ట్రేషన్‌లతో కాలనీవాసులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 2022లో జీవో 118ను తీసుకరావడంతో సుమారు 70శాతం బాధితులకు న్యాయం జరిగి వారికి కన్వీనెన్స్ డీడ్‌లు తీసుకుని రిజిస్ట్రేషన్లు చేసుకుని, ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రుణాలు కూడా తీసుకున్నారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మారడంతో ఇట్టి కన్వీనెన్స్ డీడ్‌ల రిజిస్ట్రేషన్లు నిలిచాయని, వాటిని ఆపివేసింది మధుయాష్కీయే అని ఎమ్మెల్యే ఆరోపించారు. జీవో 118లో ఉన్న లోపాలు సరిచేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం జీవోని సవరించాలని, లేకపోతే దానిని రద్దు చేయాలని డిమాండ్ చెశారు. సమావేశంలో బాధిత కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, సుధాకర్‌రెడ్డి, ముత్యంరావు, మహేందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ధన్‌రాజ్, రవీందర్‌రెడ్డి, అనిల్ చౌదరి, సుమన్‌గౌడ్, సతీష్‌గౌడ్, వెంకటస్వామియాదవ్ పాల్గొన్నారు.

వివాదాల సత్వర పరిష్కారానికే మధ్యవర్తిత్వ కేంద్రాలు

● జస్టిస్ నర్సింగ్‌రావు



జస్టిస్ నర్సింగ్‌రావును సత్కరిస్తున్న ఫేడ్ చైర్మన్ గంగారాం

సైదాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల మధ్య ఏర్పడిన వివాదాలను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వ కేంద్రాలు ఉపయోగపడతాయని హైకోర్టు జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు అన్నారు. మలక్‌పేటలోని లూయిస్ బ్రెయిలీ పార్కు అవరణలో ఫేడ్ సహకారంతో ఏర్పాటు చేసిన యూనివర్సల్ కమ్యూనిటీ మేడియేషన్ సెంటర్‌ను రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ పంచాక్షరితో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. తెలంగాణలోని తొమ్మిది జిల్లాల్లో 30 మధ్యవర్తిత్వ కేంద్రాలను ప్రారంభించినట్టు జస్టిస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రాజు, సిటీ సివిల్ కోర్టు జడ్జి మురళీమోహన్, జిల్లా న్యాయాధికార సేవా సంస్థ కార్యదర్శి కిరణ్మయి, సీనియర్ అడ్వకేట్ ఆసిఫ్, ఫెడ్ చైర్మన్ గంగారాం, ప్రధాన కార్యదర్శి నాగభూషణం, మీడియేటర్స్ అబ్దుల్‌లతీఫ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు శుభ్రతకు సహకరించాలి

● జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి



సరూర్‌నగర్ చెరువు శుభ్రతపై సిబ్బందికి సూచనలు చేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ చెరువును పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని లింగోజీగూడ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి ప్రజలను కోరారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సరూర్‌నగర్ చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు పరిసర కాలనీలైన తపోవన్‌కాలనీ, గ్రీన్‌పార్క్ కాలనీ, సింగరేణి కాలనీ నివాసితులు, రోడ్డు గుండా వెళ్లే వారు వాకింగ్ ట్రాక్‌పై చెరువు చుట్టూ చెత్త వేయరాదని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఎస్‌ఈ మాధవరెడ్డి, సరూర్‌నగర్ ఏఈ రాంబాబు, ఎల్బీనగర్ ఏఈ మణి, అర్జున్, షాన్, యాదయ్య, శంకర్, రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశం ఒకే ఎన్నికపై విస్తృత ప్రచారం కల్పించాలి

● లింగాల హరిగౌడ్



మాట్లాడుతున్న కన్వీనర్ హరిగౌడ్

సైదాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఒకే దేశం ఒకే ఎన్నికతో అనేక లాభాలు ఉన్నాయని, దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని ప్రోగ్రాం భాగ్యనగర్ జిల్లా కన్వీనర్ లింగాల హరిగౌడ్ అన్నారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఆధ్వర్యంలో సైదాబాద్ డివిజన్ ఏపీఏయూ కాలనీలో ఒకే దేశం ఒకే ఎన్నికపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకే దేశం ఒకే ఎన్నిక అనేది భారత ప్రజాస్వామ్యంలో ఒక విప్లవాత్మక అడుగు అని కొనియాడారు. ప్రజాధనం వృథా కాకుండా ఉండాలంటే వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో సాధ్యమని అన్నారు. తరుచుగా ఎన్నికల నిర్వహణ, ఎలక్షన్ కోడ్‌తో అభివృద్ధి కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడుతుందని, తద్వారా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ప్రవీణ్‌కుమార్, వాకర్స్ అసోసియేసన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మురుగు నీటి లీకేజీ నివారణకు చర్యలు

● కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో మురుగు నీటి లేకేజీ నివారణకు సత్వర చర్యలు చేపట్టాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మారుతీనగర్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తుండడంతో వరదనీరు, మురుగునీటితో మ్యాన్‌హోళ్లు నిండిపోయే ప్రాంతాలను జలమండలి అధికారులు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు ప్రసాద్ యాదవ్, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహపురి కాలనీలో..

స్నేహపురి కాలనీలో ఐదు రోజులుగా రోడ్ నెం. 2. 3లలో రహదారులపై మురుగు నీరు ప్రవహిస్తోందని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు డీవీ రామారావు కోరారు.

శాస్త్రోక్తంగా లక్ష్మీగణపతి హోమం



స్నేహపురి కాలనీలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం శాస్త్రోక్తంగా లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. -కొత్తపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి)

మట్టి రోడ్లకు మహర్దశ ఎప్పుడో..?

● మూడు దశాబ్దాల క్రితం కాలనీలు ఏర్పాటు
● గ్రామీణ రోడ్లను తలపిస్తున్న నగర శివారు ప్రాంతాలు
● బీటీ రోడ్డు నిర్మించాలని వేడుకోలు
● పట్టించుకోని అధికారులు

హయత్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు.. రెండు కాదు.. ఈ కాలనీలు ఏర్పడి దాదాపు మూడు దశాబ్దాలు దాటింది. నగర శివారు హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్‌లో నేటికీ మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. దీంతో ఏటా వర్షాకాలంలో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కాలనీల మీద జీహెచ్‌ఎంసీ అధికారులు దృష్టి సారించకపోవడం మూలంగానే కాలనీలు మౌలిక సదుపాయాలకు నోచుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ ఉన్న రోడ్లను చూస్తుంటే గ్రామీణ రోడ్లు గుర్తుకువస్తున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మారిస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.



గుంతలమయమైన ముదిరాజ్‌కాలనీలోని మట్టిరోడ్డు

మట్టి రోడ్లే దిక్కు..

జీహెచ్‌ఎంసీ నగర శివారు హయత్‌నగర్ డివిజన్‌లోని 25 కాలనీలలో ఇప్పటికీ మట్టి రోడ్లే ఉన్నాయి. విద్యానగర్, కమర్షియల్‌కాలనీ, గాయత్రినగర్, ముదిరాజ్‌కాలనీ, ఛత్రపతి శివాజీనగర్, వెంకటేశ్వరకాలనీల్లో మట్టి రోడ్లు ఉన్నాయి. 11 కాలనీలలో సగం రోడ్డు ఉండగా సగం మట్టిరోడ్లు ఉన్నాయి. 7 కాలనీలలో పూర్తిగా రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. 9 కాలనీలలో అంతర్గత రోడ్లు లేవు. దాదాపు 5 కాలనీలలో సీవరేజ్ లేకపోవడంతో రోడ్ల నిర్మాణం ఆగిపోయింది. మన్సూరాబాద్ డివిజన్‌లోని సత్యానగర్‌కాలనీ దాదాపు 30 సంవత్సరాల క్రితం ఏర్పడింది. అందులో 170 ఇళ్లు ఉండగా అందులో కేవలం మూడంటే మూడు రోడ్లు మాత్రమే సీసీ రోడ్లు ఉన్నాయి. మిగతా రోడ్లన్నీ మట్టిరోడ్లే. వెంకటేశ్వరకాలనీలోనూ సుమారు 70 ఇళ్లు ఉన్నాయి. అందులో భారీ అపార్టుమెంట్లు ఏడు వరకు ఉన్నాయి. ఈ కాలనీలో ఇంత వరకు ఒక్క సీసీ రోడ్డు లేదు. అన్మగల్ హయత్‌నగర్‌లోని మరో కాలనీ ముదిరాజ్‌కాలనీలో ఒక్క రోడ్డు కూడా లేదు. డ్రైనేజీ సౌకర్యం లేదు. దీంతో మురుగునీరు రోడ్ల వెంట పారుతుంది. అధికారులు స్పందించి తక్షణమే మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.



వెంకటేశ్వరకాలనీలోని మట్టిరోడ్ల దుస్థితి

మట్టి రోడ్ల మార్గమే..



అన్మగల్ హయత్‌నగర్‌లోని సాయినగర్‌కాలనీ నుంచి విడిపోయిన వెంకటేశ్వరకాలనీలో సుమారు 70 ఇళ్లు ఉన్నాయి. ఇటీవల ఏడు అపార్టుమెంట్లు నిర్మించారు. ఇంత వరకు కాలనీలో ఒక్క సీసీ రోడ్డు నిర్మించలేదు. క్రమం తప్పకుండా ఇంటి ట్యాక్సులు చెల్లిస్తున్నా.. అభివృద్ధి మాత్రం శూన్యం.
- లెంకల బుచ్చిరెడ్డి, అధ్యక్షుడు, వెంకటేశ్వరకాలనీ

చాలా సార్లు ఫిర్యాదు చేశా



నగరశివారులో ఉన్న హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్‌లకు అధిక నిధులు కేటాయించాలని బీజేపీ కార్పొరేటర్లందరం కలిసి జీహెచ్‌ఎంసీ కమిషనర్, మేయర్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేశాం. అయినా నిధులు మంజూరు చేయడం లేదు. అధికారుల నిర్లక్ష్యం వల్ల కనీసం భూగర్భ డ్రైనేజీ, రోడ్డు జరగడం లేదు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోతున్నాం. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ కమిషనర్, మేయర్ హయత్‌నగర్ డివిజన్‌కు అధిక నిధులు కేటాయించాలి.
- కళ్లెం నవజీవన్‌రెడ్డి, కార్పొరేటర్, హయత్‌నగర్



ఎలక్ట్రిక్ బైక్ షో రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎలక్ట్రిక్ వాహనాలతో కాలుష్య నివారణ

● ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

కొత్తపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ వాహనాలను వాడాలని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. స్నేహపురి - నాగోల్ దారిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అనంతుల రాజారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కైనెటిక్ గ్రీన్, రివోల్ట్, కొమాకీ ఈవీ బైకుల సేల్స్ షోరూమ్స్‌ను కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో పెట్రోల్, డీజిల్ వాహనాల వాడకం తగ్గి ఎక్కువ శాతం బ్యాటరీ వాహనాలను వాడే అవకాశం ఉందన్నారు. బ్యాటరీ వాహనాలతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించే వీలుందని ఆయన పేర్కొన్నారు. మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసేందుకు ఈ బైకుల ధరలు అందుబాటులో ఉన్నాయని షో రూమ్ అధినేత అనంతుల రాజారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కైనెటిక్ గ్రీన్, రివోల్ట్, కొమాకీ ఈవీ బైకుల సేల్స్ షోరూమ్స్ ఎండీలు అనంతుల భరత్ భూషణ్‌రెడ్డి, దుర్గారెడ్డి, హరీశ్‌కుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్త, మాజీ కార్పొరేటర్లు విఠల్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, సురేందర్‌యాదవ్, చిరంజీవి, మహేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలి: రవీంద్రాచారి



కుంట్లూర్ శాఖ కార్యదర్శికి మినిట్స్ బుక్‌ను అందజేస్తున్న రవీంద్రాచారి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వెంటనే దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. కుంట్లూర్‌లో ఆ పార్టీ శాఖ మహాసభను ఆదివారం నిర్వహించారు. మహాసభకు రవీంద్రచారితో పాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను రవీంద్రాచారి ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ప్రజల సంక్షేమాన్ని విస్మరించి వారిని ఓట్లు వేసే యంత్రంలా ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు. వెంటనే దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టి జనాబా దామాషా ప్రకారం వారి వాటాను కేటాయించాలన్నారు. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం అమోదించి అమలు చేయాలన్నారు. పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కుంట్లూర్ శాఖ నూతన కమిటీని ప్రకటించారు. శాఖ కార్యదర్శిగా బిచ్చునాయక్, సహాయ కార్యదర్శులుగా రాంరెడ్డి, కొండల్‌రెడ్డి, సభ్యులుగా పద్మ, లక్ష్మమ్మ, రమేశ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ హరిసింగ్‌నాయక్, శేఖర్, గణేశ్, గోపి, సైదులు, అనసూయ, రాజు, రవళి పాల్గొన్నారు.

భారత సైనికుల పోరాటం గర్వకారణం

● రంగారెడ్డి జిల్లా అటవీశాఖాధికారి సుధాకర్‌రెడ్డి



పాటలు పాడుతున్న ప్రముఖ గాయకుడు నల్లగొండ గద్దర్

మన్సూరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో భారత సైనికుల పోరాటం యావత్ దేశానికే ఎంతో గర్వకారణమని రంగారెడ్డి జిల్లా అటవీశాఖాధికారి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. వారి పోరాటాలను మరోసారి గుర్తు చేసుకుంటూ పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మహవీర్ హరిణ వనస్థలి పార్కులో ఆపరేషన్ సిందూర్ 6కే రన్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి డీఎఫ్‌ఓ సుధాకర్‌రెడ్డి, ఎఫ్‌బీవో నవీన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై 6కే రన్‌ను ప్రారంభించారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని, రోజూ రన్నింగ్, వాకింగ్, యోగా లాంటి వ్యాయామాలు చేయాలని డీఎఫ్‌వో సూచించారు. ఈ రన్‌లో ప్రముఖ గాయకుడు నల్లగొండ గద్దర్ పాల్గొని పలు పాటలు పాడారు. అనంతరం రన్నింగ్‌లో పాల్గొన్న వారందరికీ మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగోల్ సీఐ సూర్యానాయక్, ఎస్‌ఐ శివనాగప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లుగౌడ్, ఉపాధ్యక్షుడు జగదీశ్‌యాదవ్, యోగా గురువు ఉపేందర్, సభ్యులు కృష్ణ, విష్ణు, నర్సింహా, కార్తీక్ పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతకు ఆయుష్మాన్ కార్డులు

● కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్

ఎల్బీనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య భద్రతకు ఆయుష్మాన్ కార్డులు ఎంతో దోహదపడతాయని, దేశ ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రధాని మోదీ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రారంభించారని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ అన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డు నమోదు ప్రక్రియపై బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వరకాలనీ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా నాణ్యమైన వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. అర్హులందరూ ఈ కార్డును సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆయుష్మాన్ కార్డును ఉచితంగా నమోదు చేయించి అందిస్తున్నామని అధ్యక్షుడు డాక్టర్ ఏవీఆర్ మూర్తి తెలిపారు. ఈ సమావేశంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ధనంరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, బ్రాహ్మణ ఐక్యవేదిక ప్రధానకార్యదర్శి ఎంవీ సోమేశ్వరులు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్‌లో విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా సోమవారం కరెంటు సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ వాంబేకాలనీ, గంగా హాస్పిటల్, ఆనంద్‌నగర్, పుష్పగార్డెన్, శివంహిల్స్, అల్కాపురి, లక్ష్మీనగర్, తారామతిపేట్, గౌరెల్లి, శివగంగకాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 10 నుంచి 1 గంటల వరకు, 11కేవీ ఎల్‌బీనగర్, సిరీస్, లింగోజిగూడ, హనుమాన్‌నగర్, డెంటల్‌కాలేజ్, యాదవ్‌నగర్, ప్రజయ్‌నివాస్, పసుమాముల ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.



హన్వశ్రీకి సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న శ్రీనివాస్ గుప్తా

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమని, అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా సూచించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాయిరామ్‌నగర్ కాలనీకి చెందిన హన్వశ్రీకి మంజూరైన రూ.3.50లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీని ఆదివారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. వరుణ్, డా.రాజయ్యగుప్తా పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

మౌలిక వసతుల కల్పనకు కృషి: నరసింహారెడ్డి

హయత్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డివిజన్ శివారులో ఉన్న అన్ని కాలనీలకు మౌలిక వసతులకు తన వంతుగా కృషి చేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి ప్రజలకు హామీనిచ్చారు. హయత్‌నగర్ ఏరియాలోని పవనగిరి కాలనీ-1 ఫేజ్-2, ఆదిత్యనగర్, రాజరాజేశ్వరీనగర్ కాలనీలలో రూ. 65 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ఆదివారం ప్రారంభించారు. డివిజన్‌లోని సమస్యలను జోనల్ కమిషనర్‌కు వివరించి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు కార్పొరేటర్ నరసింహారెడ్డి తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కృష్ణాగౌడ్, మురళీధర్‌రెడ్డి, సాయిలుగౌడ్, నరసింహ, వేణుగోపాల్‌రెడ్డి, జాన్ తదితరులు పాల్గొన్నారు.



సుదర్శన నారసింహ హోమమును నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా సుదర్శన నారసింహ హోమం

మన్సూరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ చంద్రపురి కాలనీలోని వైష్ణవ సేవా సదనంలో సుదర్శన నారసింహ హోమాన్ని వైష్ణవ సేవ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం దేవనాథ రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో కొనసాగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ, వైష్ణవ సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎస్వీఎస్ ట్రస్ట్‌లో సమూల మార్పులు చేసి నూతన సభ్యులను ఎన్నుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు రఘువీర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నివాస హక్కుల నేత అశ్వక్ సంస్మరణ సభ

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నివాస హక్కుల నేత అశ్వక్ సంస్మరణ సభను మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో మలక్‌పేటలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి మానవ హక్కుల వేదిక వ్యవస్థాపకుడు జీవన్‌కుమార్ హాజరై మాట్లాడారు. దివంగత అశ్వక్ దశాబ్దాలుగా నివాస హక్కుల మీద పనిచేశారని, మూసి బచావ్ ఆందోళనకి సారథ్యం వహించారని గుర్తు చేశారు. మలక్‌పేటలోని మూసానగర్ బస్తీ నాయకుడి నుంచి నివాస హక్కుల నేతగా ఎదిగారని కొనియాడారు. బస్తీ సమస్యల పట్ల వివిధ వేదికలపై ప్రాతినిధ్యం వహిస్తూ పట్టణ సమస్యలపై తీవ్రంగా పోరాడారని గుర్తు చేశారు. యుగంతర్ సంస్థ కరీం అన్సారి మాట్లాడుతూ ప్రస్తుతం పాలకుల నిర్లక్ష్యం వల్ల చాలా మంది యువత నేరారోపణలకు గురవుతున్నారని అన్నారు. సమావేశంలో మానవ హక్కుల వేదిక హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, వసంతలక్ష్మి, వెంకటనారాయణ పాల్గొన్నారు.